



# గగన వీధిలో ఘన సారథి!

నలుగురు నడిచేదారి నాకొద్దని.. ప్రత్యేకతను కోరుకుంటూ కలల ఆకాశంలో విహరించే వారికి విలువైన ఉద్యోగం పైలట్. చక్కటి ఫిట్‌నెస్, హుందాగా యూనిఫాం, సామాజిక గౌరవం.. అన్నింటికి మించి ఆకర్షణీయమైన ఆరంకెల జీతం. రాష్ట్రాలు దాటి, ఖండాలను చుట్టి ప్రపంచం మొత్తం పనిగా తిరిగి వచ్చే పసందైన కొలువు. అది కావాలంటే కమర్షియల్ లైసెన్స్ (సీపీఎల్) పొందాలి. పైలట్‌గా చేరడానికి ప్రభుత్వ, ప్రైవేటు రంగాల్లో పలు అవకాశాలు ఉన్నాయి. శిక్షణతోపాటు ఉద్యోగాన్ని కూడా ఆయా సంస్థలు అందిస్తున్నాయి.

**✈ ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు అవకాశం ✈ శిక్షణలో నెలకు రూ.50 వేలకుపైగా స్టైపెండ్ ✈ ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఉద్యోగం**

ఆకాశంలో ఎగిరే విమానం చూస్తే అందరికీ అదో ఆనందం. విమానం శబ్దం వినగానే ఎవరైనా మిద్దె మీదకో, బాల్కనీ అంచుకో చేరి కుడిచేతిని ఎత్తి కళ్లపై కాంతి పడకుండా అడ్డం పెట్టుకొని కన్నార్పకుండా చూసి వెళ్లాల్సిందే. పెద్దయ్యాక ఏమవుతావురా అని అడిగితే పిల్లలు కొంతమంది పైలట్ అవుతా.. అంటారు. అదీ విమానం మోజే. ప్రైవేటు విమానయానం విస్తరించిన తర్వాత ఈ రంగంలో ఉద్యోగాలు పెరుగుతున్నాయి. ఇంతకీ మన పిల్ల పిడుగులు ఎవరికీ అందనంత ఎత్తులో ఎగిరే పైలట్ కావడం ఎలా అంటారా.. దానికి పలు రకాల మార్గాలు ఉన్నాయి. శిక్షణ పొందుతూనే నెలకు రూ.50 వేలపైనే స్టైపెండ్ అందుకోవచ్చు. మెరుగైన నైపుణ్యాలు సాధిస్తే యుద్ధ విమానాలూ నడిపే వీలుదొరుకుతుంది. అన్నీ కలిసొస్తే భవిష్యత్తులో భారతీయ వాయుసేనను ఆధిపత్యం చేసే స్థాయికీ చేరుకోవచ్చు. యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ అండ్ నేవల్ అకాడెమీ (ఎన్డీఏ అండ్ ఎన్ఏ), కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) ఇంటర్, డిగ్రీ విద్యార్హతలతో పైలట్ శిక్షణ, ఉద్యోగం రెండూ అందిస్తున్నాయి. అవే కాకుండా ఎయిర్ ఫోర్స్ (ఏఎఫ్ క్యాట్), నేవీ (షార్ట్ సర్వీస్ కమిషన్)లు గ్రాడ్యుయేట్లకు ప్రత్యేకంగా పరీక్షలు నిర్వహించి పైలట్ శిక్షణ, ఉద్యోగాన్ని కల్పిస్తున్నాయి.

## ఇంటర్‌తో ఎన్డీఏ

పైలట్ కావడానికి మొదటి ప్రధాన అవకాశంగా యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) నిర్వహించే నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్డీఏ) పరీక్షను పేర్కొనవచ్చు. దీన్ని ఏడాదికి రెండు సార్లు నిర్వహిస్తారు. జనవరి, జూన్‌లో ప్రకటనలు వస్తాయి. ఎన్డీఏతో ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలు లభిస్తాయి. పైలట్ కావాలనుకునేవాళ్లు ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ఎంచుకోవాలి. ఫిజిక్స్, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణులు ఎయిర్ ఫోర్స్‌కు దరఖాస్తు చేసుకోవచ్చు. ద్వితీయ సంవత్సరం విద్యార్థులు సైతం అర్హులే. వయసు 16 1/2 ఏళ్ల నుంచి 19 1/2 ఏళ్లలోపు ఉండాలి. బాలురు మాత్రమే అర్హులు. అలాగే పైలట్ ఉద్యోగానికి 162.5 సెం.మీ. ఎత్తు ఉండాలి.



**ఎంపిక ఇలా:** అభ్యర్థుల ఎంపిక రెండు దశల్లో జరుగుతుంది. అవి: రాత పరీక్ష (ఆబ్జెక్టివ్ తరహా), ఇంటెలిజెన్స్ - పర్సనాలిటీ టెస్ట్. రాత పరీక్షలో మొత్తం 900 మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. ఇందులో రెండు పేపర్లు ఉంటాయి. పేపర్-1 మ్యాథ్స్, పేపర్-2 జనరల్ ఎబిలిటీ. రాత పరీక్షలో అర్హత పొందిన వారికి సర్వీస్ సెలక్షన్ బోర్డ్ (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో యూపీఎస్సీ ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టులు రెండు అంచెల్లో నిర్వహిస్తుంది. రాత పరీక్ష, సర్వీస్ సెలక్షన్ బోర్డు నిర్వహించిన పరీక్షల్లో వచ్చిన మొత్తం మార్కుల ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. వీరికి పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టు నిర్వహిస్తారు. ఇందులో అర్హత సాధిస్తేనే పైలట్ శిక్షణలోకి అనుమతి లభిస్తుంది. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి కోర్సులో చేర్చుకుంటారు.

**చదువు, శిక్షణ:** ఏడు వేల ఎకరాల సువిశాల క్యాంపస్ నేషనల్ డిఫెన్స్ అకాడెమీ (ఎన్‌డీఏ) పుణెలో అభ్యర్థులకు శిక్షణ, చదువు మూడేళ్లపాటు ఉంటాయి. పుస్తకాలు, భోజనం, వసతి సౌకర్యం అన్నీ ఉచితమే. అనంతరం అసలు సిసలైన పైలట్ శిక్షణ ఎయిర్ ఫోర్స్ అకాడెమీ (ఏఎఫ్ఏ) - హైదరాబాద్ (దుండిగల్)తో పాటు పలు కేంద్రాల్లో సుమారు 18 నెలల వరకు నిర్వహిస్తారు. విజయవంతంగా శిక్షణ పూర్తిచేసుకున్నవారికి బీటెక్‌ను దిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ (జేఎన్‌యూ) ప్రదానం చేస్తుంది. పట్టా పుచ్చుకున్న తర్వాత వీరు ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో చేరిపోవచ్చు.

## డిగ్రీతో సీడీఎస్ఈ

డిగ్రీ అర్హతతో యూపీఎస్సీ ఏడాదికి రెండు సార్లు కంబైన్డ్ డిఫెన్స్ సర్వీసెస్ ఎగ్జామినేషన్ (సీడీఎస్ఈ) ను నిర్వహిస్తోంది. నవంబరు, ఆగస్టుల్లో ప్రకటనలు వెలువడతాయి. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్‌ల్లో ఉన్నత స్థాయి ఉద్యోగాలకు సీడీఎస్ఈ నిర్వహిస్తున్నారు. పైలట్ కావాలనుకున్నవారు ఎయిర్ ఫోర్స్ విభాగాన్ని ఎంచుకోవాలి.

**అర్హత:** ఏదైనా సాధారణ డిగ్రీ లేదా బీఈ / బీటెక్ ఉత్తీర్ణత. అయితే ఇంటర్‌లో మాత్రం మ్యాథ్స్, ఫిజిక్స్ చదివుండడం తప్పనిసరి. ఆఖరు సంవత్సరం డిగ్రీ కోర్సులు చదువుతున్నవాళ్లూ దరఖాస్తు చేసుకోవచ్చు.

**వయసు:** 20-24 ఏళ్లలోపు ఉండాలి. పురుషులు మాత్రమే అర్హులు. ఎత్తు 162.5 సెం.మీ. ఉండాలి.

**ఎంపిక విధానం:** ఇంగ్లిష్, జనరల్ నాలెడ్జ్, ఎలిమెంటరీ మ్యాథమెటిక్స్‌లతో స్టేజ్-1 రాత పరీక్ష, స్టేజ్-2లో జరిపే ఇంటెలిజెన్స్ అండ్ పర్సనాలిటీ టెస్టుల ద్వారా జరుగుతుంది. పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టులోనూ అర్హత సాధించాలి. ఎంపికైనవారికి 74 వారాల పాటు ఎయిర్ ఫోర్స్ అకాడమీలో శిక్షణ ఇస్తారు. అనంతరం ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో విధుల్లోకి తీసుకుంటారు.

## మరో మార్గం... ఏఎఫ్‌క్యాట్

ఎయిర్ ఫోర్స్ కామన్ ఎంట్రన్స్ టెస్టు (ఏఎఫ్ క్యాట్) పేరుతో ఇండియన్ ఎయిర్ ఫోర్స్ ప్రత్యేకంగా ఏడాదికి రెండు సార్లు పరీక్ష నిర్వహిస్తోంది. ఏటా జూన్, డిసెంబరుల్లో ఈ పరీక్ష ప్రకటన వెలువడుతుంది. ఇందులో పలు రకాల పోస్టులు ఉంటాయి. వీటిలో ఫ్లయింగ్ ఆఫీసర్ (పైలట్) ఒకటి. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఈ పోస్టులు భర్తీ చేస్తారు. ఈ విధానంలో ఎంపికైనవారు 14 ఏళ్లపాటు విధుల్లో కొనసాగుతారు. మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. నేషనల్ కాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ)-సీ సర్టిఫికెట్ ఉన్నవారు ఎన్‌సీసీ స్పెషల్ ఎంట్రీ ద్వారా పైలట్ కావచ్చు. ఈ నియామకాలు కూడా ఏఎఫ్‌క్యాట్ తోనే చేపడతారు.

**అర్హత:** ఫ్లయింగ్ బ్రాంచ్ పోస్టులకు 60 శాతం మార్కులతో ఏదైనా సాధారణ డిగ్రీ లేదా బీఈ/ బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు. అయితే ఇంటర్లో మ్యాథ్స్, ఫిజిక్స్ తప్పనిసరి. ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్న విద్యార్థులు కూడా అర్హులే.

**వయసు:** 20 నుంచి 24 ఏళ్లలోపు ఉండాలి.

**ఎత్తు:** కనీసం 162.5 సెం.మీ. ఉండాలి.

**రాత పరీక్ష:** వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. బహుళైచ్ఛిక విధానంలో ప్రశ్నలడుగుతారు. ఇందులో జనరల్ అవేర్‌నెస్, ఇంగ్లిష్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, మిలటరీ ఆప్టిట్యూడ్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఈ పరీక్షలో ఉత్తీర్ణులకు ఇంటెలిజెన్స్ పరీక్ష ఉంటుంది. ఇందులో అర్హత సాధించినవారికి సైకలాజికల్ టెస్ట్, బృంద పరీక్షలు, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు. చివరగా పైలట్ ఆప్టిట్యూడ్ టెస్టులోనూ అర్హత సాధిస్తే పైలట్ శిక్షణకు ఎంపిక చేస్తారు.

**శిక్షణ:** ముందుగా ఆరు నెలల పాటు ప్రాథమిక శిక్షణ నిర్వహిస్తారు. సాధారణంగా దీన్ని ఎయిర్ ఫోర్స్ అకాడమీ - దుండిగల్, హాకింపేట్, ఎలహంక, బీదర్‌ల్లో చేపడతారు. అనంతరం అభ్యర్థుల ప్రతిభ ప్రకారం ఫైటర్ పైలట్, ట్రాన్స్ పోర్ట్ పైలట్, హెలికాప్టర్ పైలట్లుగా విడదీసి అందుకుతగ్గ శిక్షణను రెండు దశల్లో నిర్వహిస్తారు. ఈ సమయంలో నెలకు రూ.56,100 చొప్పున స్టైపెండ్ చెల్లిస్తారు. శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులను ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు.

## ఉద్యోగంలో...

ఎన్డీఏ, సీడీఎస్ఈ, ఏఎఫ్ క్యాట్ తదితర ఏ విధానాల్లో అభ్యర్థులు ఎంపికైనప్పటికీ విజయవంతంగా పైలట్ శిక్షణ ముగించుకుని ఉద్యోగంలో చేరిన తర్వాత వేతనం, హోదా అంతా సమానంగానే ఉంటాయి. ఎయిర్ ఫోర్స్‌లో అయితే ఫ్లయింగ్ ఆఫీసర్, నేవీలో సబ్ లెఫ్టినెంట్ హోదా ఇస్తారు. రూ.56,100 మూల వేతనం చెల్లిస్తారు. దీనికి డీఏ, హెచ్ఆర్ఏ ఇతర అలవెన్సులు అదనం. మిలటరీ సర్వీస్ పే కింద ప్రతి నెల రూ.15,500 చెల్లిస్తారు. వీటితోపాటు ఫ్లయింగ్ అలవెన్సు (విమానం నడిపే వ్యవధికి) కూడా ఉంటుంది. ట్రాన్స్‌పోర్ట్ అలవెన్సు, చిల్డ్రన్ ఎడ్యుకేషన్ అలవెన్సు, రాయితీ ధరలకు క్యాంటీన్, ఫర్నీచర్‌తో కూడిన నివాస సముదాయం, తక్కువ వడ్డీకి రుణాలు, ఎల్టీఏ, 60 వార్షిక సెలవులు, 20 సాధారణ సెలవులు... ఉంటాయి. వేతన రూపంలో ప్రతినెలా రూ. లక్ష వరకు అందుకోవచ్చు. ఫ్లయింగ్ ఆఫీసర్ హోదాతో ఎయిర్ ఫోర్స్‌లో చేరినవారు రెండేళ్ల అనుభవంతో ఫ్లయిట్ లెఫ్టినెంట్‌గా పదోన్నతి పొందుతారు. ఆరేళ్ల అనుభవం ఉన్నవారు స్క్వాడ్రన్ లీడర్ అవుతారు. పదమూడేళ్ల సర్వీస్‌తో వింగ్ కమాండర్ స్థాయికి చేరుకుంటారు. అనంతరం శాఖాపరమైన నియామకాల ద్వారా ఇంకా ఉన్నత స్థాయులకు చేరుకోవచ్చు. అత్యున్నత ప్రతిభావంతులు భవిష్యత్తులో ఎయిర్ చీఫ్ మార్షల్ (ఎయిర్ ఫోర్స్‌లో అత్యున్నత ఉద్యోగం)గా భారతీయ వాయు సేనకు దిశానిర్దేశం కూడా చేయవచ్చు.

www.upsc.gov.in
http://careerairforce.nic.in

## నేవీలోనూ పైలట్

షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో ఇండియన్ నేవీ పైలట్ పోస్టులను భర్తీ చేస్తుంది. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లు ఈ పోస్టులకు అర్హులు. పదోతరగతి, ఇంటర్, ఇంజినీరింగ్ అన్నింట్లోనూ 60 శాతం మార్కులు తప్పనిసరి. వీటితోపాటు టెన్త్, ఇంటర్ ఇంగ్లిష్‌లో 60 శాతం మార్కులు ఉండాలి. 162.5 సెం.మీ. ఎత్తుతో, 21-24 ఏళ్లలోపు వారు అర్హులు. మహిళలు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంజినీరింగ్ ఆఖరు సంవత్సరం కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. షార్ట్ లిస్ట్ చేసి ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూల ద్వారా నియామకాలు చేపడుతుంది. ఎంపికైనవారికి నేవల్ అకాడమీ ఎజిమాలలో 22 వారాల పాటు శిక్షణ ఉంటుంది. అనంతరం స్టేజ్ -1, స్టేజ్ -2 ఫ్లయింగ్ శిక్షణ ఎయిర్ ఫోర్స్ అకాడమీలో ఇస్తారు. వీరు నౌకాదళం తరఫున యుద్ధ విమానాలు, హెలికాప్టర్లు నడుపుతారు. గరిష్ఠంగా 14 ఏళ్లపాటు సేవల్లో కొనసాగుతారు. ఏడాదికి రెండుసార్లు మార్చి, అక్టోబరుల్లో ప్రకటన వెలువడుతుంది. www.joinindiannavy.gov.in

## సివిల్ పైలట్

సివిల్ పైలట్ కోర్సుల్లో చేరడానికి ఇంటర్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్ చదవాలి. 17 ఏళ్లు నిండినవారికి అవకాశం లభిస్తుంది. దేశంలో డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) గుర్తింపు పొందిన 30 పైలట్ శిక్షణ సంస్థలు ఉన్నాయి. వీటిలో 18 నెలల కోర్సు పూర్తిచేసుకుని కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) అందుకోవచ్చు. ఈ 30 సంస్థల్లో ఇందిరాగాంధీ రాష్ట్రీయ ఉడాన్ అకాడమీ (ఐజీఆర్‌యూఏ)కు జాతీయ స్థాయిలో పేరుంది. ఇక్కడ సీపీఎల్ కోర్సు పూర్తిచేయడానికి రూ. 45 లక్షల వరకు వ్యయం అవుతుంది. ప్రస్తుతం విమాన ప్రయాణికులు పెరుగుతున్నారు. చిన్న పట్టణాల్లోనూ విమానాశ్రయాలు ఏర్పాటయ్యే అవకాశాలు మెరుగవుతున్నాయి. భారీ ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కాబట్టి అభ్యర్థులు ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి. పైలట్ వృత్తిలో చేరిన తర్వాత ప్రతి ఆరు నెలలకు ఒకసారి మెడికల్ టెస్టుల్లో ఫిట్‌నెస్ నిరూపించుకోవాల్సి ఉంటుంది.

### ఎస్పీఎల్‌తో మొదలు

స్టూడెంట్ పైలట్ లైసెన్స్ (ఎస్పీఎల్) తో సివిల్ పైలట్ శిక్షణ మొదలవుతుంది. కొన్నాళ్ల శిక్షణ అనంతరం ప్రైవేటు పైలట్ లైసెన్స్ (పీపీఎల్) మంజూరు చేస్తారు. ఈ దశలో వీరు ఒంటరిగా చిన్నపాటి శిక్షణ విమానాన్ని నడపాలి. మరికొంత అదనపు శిక్షణ, అనుభవం అనంతరం కమర్షియల్ పైలట్ లైసెన్స్ (సీపీఎల్) ప్రదానం చేస్తారు. సీపీఎల్ డిగ్రీని డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) మంజూరు చేస్తుంది. ఈ లైసెన్స్‌తో ప్రయాణికులను చేరవేసే విమానాలు నడపడానికి అర్హత పొందుతారు. కొత్త పైలట్లను ఎయిర్ లైన్స్ సంస్థలు కో పైలట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటాయి.

పైలట్ శిక్షణ కోసం ప్రభుత్వ ఆధ్వర్యంలో నిర్వహిస్తోన్న సంస్థల్లో చేరడానికి తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. మెరుగైన శిక్షణ పొందాలనుకునేవారు కెనడా, అమెరికాల్లో పైలట్ కోర్సు అభ్యసించవచ్చు.

తెలంగాణలో ప్రభుత్వ ఆధ్వర్యంలో తెలంగాణ స్టేట్ ఏవియేషన్ అకాడమీ ద్వారా పైలట్ శిక్షణ అందిస్తున్నారు. ఆసియా పసిఫిక్ ఫ్లయిట్ ట్రైనింగ్ అకాడమీ లిమిటెడ్, ఫ్లైటెక్ ఏవియేషన్ అకాడమీ, వింగ్స్ ఏవియేషన్ సంస్థలు పైలట్ శిక్షణ నిర్వహిస్తున్నాయి. ఇవన్నీ హైదరాబాద్‌లోనే ఉన్నాయి.

# కామర్స్‌లో అర్హత ఖాయం!

**అసిస్టెంట్ ప్రొఫెసర్ ఉద్యోగాలకు అర్హత సాధించేందుకు, పరిశోధన రంగంలో ప్రవేశించేందుకు తెలుగు రాష్ట్రాల అభ్యర్థులకు మంచి అవకాశం వచ్చింది. ఒకే రకమైన సిలబస్‌తో వరుసగా మూడు వారాల్లో మూడు పరీక్షలు రాసేందుకు వీలు కలిగింది. కచ్చితంగా అర్హత పొందేందుకు కాలం కలిసి వచ్చింది. ఇక సరైన ప్రణాళికతో సిద్ధం కావడమే మిగిలి ఉంది.**



జాతీయ స్థాయిలో యూజీసీ-నేషనల్ ఎలిజిబిలిటీ టెస్ట్ (యూజీసీ-నెట్), మరోవైపు తెలంగాణ రాష్ట్ర స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్-సెట్), ఇంకోవైపు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఏపీ సెట్‌లకు ఇటీవల నోటిఫికేషన్లు విడుదలయ్యాయి. యూజీసీ ఇటీవల ప్రకటించిన నిబంధనల ప్రకారం కొత్త పద్ధతిలో మొదటిసారిగా పరీక్షలను జులైలో వరుసగా మూడు వారాలు నిర్వహించనున్నారు. ఒక ప్రిపరేషన్‌తో మూడు పరీక్షలు రాసే సువర్ణావకాశం అభ్యర్థులకు దక్కింది.



**డాక్టర్ ఎం. మల్లారెడ్డి,**
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల, కరీంనగర్

ఈ మూడు పరీక్షల్లో అర్హత సాధించిన అభ్యర్థులు పరిశోధనతోపాటు యూనివర్సిటీలు, డిగ్రీ కళాశాలల్లో అసిస్టెంట్ ప్రొఫెసర్ నియామకాలకు అర్హత పొందుతారు. ఏపీ-సెట్ జులై 1న, యూజీసీ-నెట్ జులై 8న, టీఎస్-సెట్ జులై 15న జరగనున్నాయి. 3 నుంచి 4 నెలల సమయం ఉంది.

## సిలబస్ విశ్లేషణ

మొదటి పేపర్ అందరికీ కామన్‌గా ఉంటుంది. అందులో అభ్యర్థుల టీచింగ్, పరిశోధన సామర్థ్యాలను పరిశీలిస్తారు. ఇప్పుడు పేపర్-2 మాత్రమే ఉంది. ఇది కూడా అభ్యర్థులకు కలిసి వచ్చే అంశం. కామర్స్ సిలబస్ పరిశీలిస్తే...

- యూనిట్-1 బిజినెస్ ఎన్విరాన్‌మెంట్‌లోని వివిధ భావనలు, ఇతర అంశాలను వర్తమాన వివరాలతో కలిపి చదవాలి.
- యూనిట్-2 ఆర్థిక, నిర్వహణ అకౌంటింగ్‌కి సంబంధించి ముఖ్యంగా ప్రాథమిక భావనలు, సూత్రాలు చదవాలి. చిన్నచిన్న సమస్యలను ఎక్కువగా సాధన చేయాలి.
- యూనిట్-3 వ్యాపార అర్థశాస్త్రంలో అభ్యర్థులు వివిధ సిద్ధాంతాల నిర్వచనాలు, ప్రమేయాలు, సంవత్సరాలు, భిన్న పటాలను ఉదాహరణలతో విశ్లేషిస్తూ లోతుగా చదవాలి.
- యూనిట్-4 వ్యాపార గణాంకశాస్త్రం- దత్తాంశ విశ్లేషణలో వివిధ పద్ధతుల సూత్రాలు, వాటి వినియోగం తెలుసుకోవాలి. తగినన్ని సమస్యలను సాధన చేయాలి. సూత్రాలను నోట్ చేసుకుంటూ చదివితే మంచి స్కోరు సాధించవచ్చు.
- యూనిట్-5 వ్యాపార నిర్వహణ విభాగంలోని శాస్త్రవేత్తల పేర్లు, వివిధ సంవత్సరాలు, వివిధ పద్ధతులపై పట్టు సాధించాలి.
- యూనిట్-6 మార్కెటింగ్ మేనేజ్‌మెంట్ ముఖ్యమైన విభాగం. దీని నుంచి 12 నుంచి 14 ప్రశ్నలు వచ్చే అవకాశం ఉంది. ప్రతి భావనను వర్తమాన విశేషాలతో కలిపి అధ్యయనం చేయాలి.
- యూనిట్-7 ఆర్థిక నిర్వహణ శాస్త్రంలోని భావనలు, సూత్రాలపై అవగాహన పెంచుకుంటూ సమస్యలను సాధన చేయాలి.
- యూనిట్-8 మానవ వనరుల నిర్వహణ కూడా అభ్యర్థులు అర్హత సాధించడంలో ప్రముఖ పాత్ర వహిస్తుంది. దీని నుంచి 12 లేదా 14 ప్రశ్నలు రావచ్చు. లోతుగా విశ్లేషిస్తూ చదవాలి..
- యూనిట్- 9 బ్యాంకింగ్, విత్తసంస్థలు సెక్షన్‌ను చదివేటప్పుడు అభ్యర్థులు ముఖ్యంగా బ్యాంకులను స్థాపించిన సంవత్సరాలు, ప్రధాన కార్యాలయాలు, ఛైర్మన్‌ల పేర్లు, విధులు, బ్యాంకుల్లో జరిగే మోసాలు, ఇంకా బ్యాంకింగ్ వర్తమాన అంశాలు ముఖ్యం.
- యూనిట్-10 అంతర్జాతీయ వ్యాపారంపై కూడా అభ్యర్థులు శ్రద్ధ వహించాలి. దీని నుంచి కూడా 12 లేదా 14 ప్రశ్నలు అడగవచ్చు. ఇందులోని వివిధ సంస్థలను స్థాపించిన సంవత్సరాలు, ప్రధాన కార్యాలయాలు, వాటి అధిపతులు, వివిధ భావనలు, రేట్లు తదితరాలను వర్తమాన విశేషాలతో జోడించి చదవాలి.
- యూనిట్-11 అకౌంటింగ్, ఫైనాన్స్‌లో అభ్యర్థులు అకౌంటింగ్ ప్రమాణాలు, ఐఎఫ్ఆర్ఎస్, వివిధ స్టాక్ ఎక్స్ఛేంజీల పని తీరు, వస్తున్న మార్పులను, భావనలను వర్తమాన వివరాలతో అనుసంధానం చేసి అధ్యయనం చేయాలి.
- యూనిట్-12 ఆదాయపు పన్ను చట్టం, పన్ను ప్రణాళిక విభాగంలోని ప్రాథమిక భావనలు, వివిధ సెక్షన్లు, పన్ను రేట్లు, పన్ను గణన చదవాలి. వీటన్నిటిని ఎక్కువ సమస్యలను ప్రాక్టీస్ చేయాలి.

### ఈ పుస్తకాలు ఉపయోగకరం

- Business Environment - Ashwathappa
- Financial & Management Accounting - Jain and Narang
- Business Economics - Mithani
- Business Statistics - SP. Guptha
- Business Management - LM Prasad
- Marketing Management - Dhilip Kotter or Rama Swamy & Nama Kumar
- Financial Management - Sharma and Shashi K. Guptha
- Human Resource Management - P. Subba Rao
- International Business - OS Srivastava or P. Subba rao
- Accounting and Finance - VA Avadhani
- Banking and Financial Institutions - AV Ranganadha Chary & Koteshwar Rao
- Income Tax Law & Tax Planning - VP Gaur, Rajeev Puri & Puja Gaur
- UGC-NET/JRF/SET - Commerce - Dr. LN Koli

■ తెలుగు మాధ్యమం కోసం తెలుగు అకాడమీ పుస్తకాలను చదవవచ్చు.

# నోటీస్ బోర్డు

### ప్రభుత్వ ఉద్యోగాలు

**ఎస్‌బీఐలో స్పెషలిస్ట్ ఆఫీసర్లు**

**ఖాళీలు:** స్పెషల్ మేనేజ్‌మెంట్ ఎగ్జిక్యూటివ్- 35, డిప్యూటీ జనరల్ మేనేజర్ (లా)- 02, డిప్యూటీ మేనేజర్ (లా)- 82. **అర్హతలు:** సీఏ/ ఐసీడబ్ల్యూఏ, డిగ్రీ(లా), ఎంబీఏ (ఫైనాన్స్), పని అనుభవం ఉండాలి. **ఎంపిక:** రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా. **ఆన్‌లైన్ దరఖాస్తు:** 20.03.2018 నుంచి 07.04.2018 వరకు. **వెబ్‌సైట్:** www.sbi.co.in

**ఏపీఎస్ఎస్‌డీసీలో మేనేజర్లు**

విజయవాడలోని ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్, మేనేజర్ ఖాళీలు. **విభాగాలు:** టెక్నికల్/ నాన్ టెక్నికల్ కాలేజెస్, ఎంటర్‌ప్రెన్యూర్, ఇన్నోవేషన్, డైరెక్ట్ ప్లేస్‌మెంట్, నాన్-అకడమిక్. **అర్హతలు:** డిగ్రీ/ పీజీ, పని అనుభవం. **దరఖాస్తు:** కరిక్యులం విటేను మెయిల్ చేయాలి. **ఈ-మెయిల్:** careers2018@apssdc.in **చివరి తేదీ:** 03.04.2018. **వెబ్‌సైట్:** www.apssdc.in

### వాక్-ఇన్స్

**కేవీల్లో టీచర్లు**

**కేంద్రాలు:** తిరుపతి, గుంటూరు కేంద్రీయ విద్యాలయాలు. **పోస్టులు:** పీజీటీ, టీజీటీ, పీఆర్‌టీ, డాక్టర్, నర్సు తదితరాలు. **అర్హతలు:** ఇంటర్, డిగ్రీ, పీజీ, డీఈడీ, బీఈడీ, సీటెట్. కేవీ నెం.1, తిరుపతిలో- **ఇంటర్వ్యూ తేదీలు:** 23, 25.03.2018, www.kv1tirupati.org
కేవీ, నల్లపాడు, గుంటూరులో- **ఇంటర్వ్యూ తేది:** 24.03.2018 www.kvguntur.org

**డాక్టర్ వైఎస్ఆర్ ఉద్యాన విశ్వవిద్యాలయం**

**ఖాళీలు:** టీచింగ్ అసోసియేట్/ రిసెర్చ్ అసోసియేట్- 30. **అర్హత:** మాస్టర్స్ డిగ్రీ, నెట్, రెండేళ్ల పని అనుభవం. **ఇంటర్వ్యూ తేదీలు:** మార్చి 26 నుంచి 28 వరకు. **వేదిక:** డా.వైఎస్ఆర్ హెచ్‌యూ క్యాంపస్, వీఆర్ గూడెం. **వెబ్‌సైట్:** www.drysrhu.edu.in

### ప్రవేశాలు

**ఏయూఈఈటీ-2018**

విశాఖపట్నంలోని ఆంధ్రా యూనివర్సిటీ 2018-19 విద్యా సంవత్సరానికి డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాంలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష. **కోర్సులు:** ఆరేళ్ల బీటెక్, ఎంటెక్ డ్యూయల్ డిగ్రీ ప్రోగ్రాం **చివరి తేదీ:** 21.04.2018.
http://aueet.audoa.in/

**పూర్తి వివరాలు, మరిన్ని నోటిఫికేషన్ల కోసం www.eenadupratibha.net చూడవచ్చు.**